## క్లుప్తంగా

### నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంంలోని బొమ్మయ్య పల్లె గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు తెల్లగుండ్లపల్లె ఎస్టీ కాలనీ, తెల్లగుండ్లపల్లె కొత్త ఇండ్లు, తెల్లగుండ్లపల్లె దళితవాడ, తెల్లగుండపల్లె, తోటానుపల్లె, తెట్టుగుండ్లపల్లె, మనమర్తి కొత్తూరు, జడబాపనపల్లె, మర్రిపల్లె, బీసీ కాలనీ, దేవళంపేట గ్రామాల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ఆది ఆంధ్రవాడలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌ సీపీ నాయకురాలు అమ్మణియమ్మ (60) మృతి చెందారు. ఈ విషయం తెలిసి మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి గ్రామానికి చేరుకుని అమ్మణియమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె కుమార్తె లావణ్యను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

### గద్దర్ మృతి తీరని లోటు



పుత్తూరులో గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న పట్టణవాసులు

పుత్తూరు రూరల్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి కార్మిక లోకానికి తీరని లోటని పలు సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం పుత్తూరులో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో నాగేంద్ర రావు, మహేష్, విజయ్, గంగాధరం, వేలు, రవి, కృష్ణమూర్తి, సాయికిరణ్, రాజేంద్ర, దిలీప్, లోకేష్, బాబీ, జైతేజ్, రమణ, మారుతి తదితరులు ఉన్నారు.

### గాయపడిన యువకుడి మృతి

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని తడుకు గ్రామం వద్ద శనివారం రాత్రి 7 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్తీక్ అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు.. చెన్నైలోని తాంబరం, భారతినగర్‌కు చెందిన స్నేహితులు కార్తీక్(20), మణి(23) ఇద్దరూ మోటర్ సైకిల్‌పై పుత్తూరు వద్ద గల సదాశివకోనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తడుకు గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ కార్తీక్ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టీడీపీ పతనం ఖాయం



మాట్లాడుతున్న నాయకులు

శ్రీరంగరాజపురం : తెలుగుదేశం పార్టీ పతనం ప్రారంభమైందని సచివాలయ మండల కన్వీనర్ బాలసుబ్రమణ్యంరెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, మన్ననలు పొందుతున్నారని అన్నారు. ఇది చూసి చంద్రబాబునాయుడు ఓర్వలేక, ఓటమి భయంతో రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని తెలిపారు. పుంగనూరులో ఓ ప్రణాళిక ప్రకారం టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైకి, పోలీసులపైకి ఉసిగొల్పి దాడి చేయించడం నీతిమాలిన చర్య అని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, డీఎస్ రాజు, బాబు, మహేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

నగరి : తమిళనాడు వేలూరులో నిర్వహించిన ఆల్‌ఇండియా కరాటే టోర్నమెంట్‌లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న నగరికి చెందిన జపాన్ షిటోరియా కరాటే స్కూల్ విద్యార్థులు మూడు ప్రథమ బహుమతులను, రెండు ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కరాటే మాస్టర్ రాజ్‌కోటి ఆధ్వర్యంలో వీరు పోటీల్లో పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షణకే మిషన్ ఇంద్రధనస్సు

కోవిడ్ బాగా విజృంభిస్తున్న తరుణంలో యాంటీ వైరస్ ఇంజెక్షన్ వేసుకోని గర్భిణులు, 5 ఏళ్లలోపు పిల్లలను మంప్స్ (గవదబిళ్లలు), రుబెల్ల వైరస్ నుంచి రక్షించేందుకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి గర్భిణులు, 5 ఏళ్లలోపు పిల్లల వివరాలను సేకరిస్తారు. వారికి ఆగస్టు 7వ తేదీ నుంచి 12 వరకు మొదటి విడతగా, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు రెండో విడతగా, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకు మూడో విడతగా వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. టీకాలు తప్పిపోయిన రెండేళ్లలోపు పిల్లలకు, 2–5 ఏళ్లలోపు బూస్టర్ డోస్ వేసుకోని వారికి వేస్తారు.

- చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం
- గవదబిళ్లలు, రుబెళ్ల నివారణకు పటిష్ట చర్యలు
- చిన్నారులు, గర్భిణుల గుర్తింపునకు వేగంగా సర్వే
- ప్రతి ఇంట వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది
- నేటి నుంచి ఉచితంగా టీకాలు



బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ పరిధిలో సర్వే ప్రకియను తనిఖీచేస్తున్న జిల్లా టీకా అధికారి

నగరి : చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి రుబెల్లా, గవదబిళ్లలు నిరోధించేందుకు జిల్లా వైద్య యంత్రాంగం సిద్ధమైంది. ఆగస్టు 7 నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు స్థానిక సచివాలయాల వద్ద, అంగన్‌వాడీ సెంటర్లలో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో టీకాలు వేయనున్నారు. ఆ టీకాలు వేసుకున్న గర్భిణులు, చిన్నారులు సంపూర్ణ టీకాలు పొందిన వారవుతారు. ఇప్పటికే ఇంటింటి సర్వే మొదలై ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లలు, 2–5 ఏళ్లలోపు పిల్లల వివరాలు నమోదు చేస్తున్నారు. దేశంలో అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాల్లో ఒకటైన మిషన్ ఇంద్రధనుస్సు ద్వారా ఏటా 3 కోట్ల మంది బాలింతలు, 2.6 కోట్ల మంది శిశువులకు టీకాలను అందించడే లక్ష్యంగా అమలు అవుతోంది.



వైద్య సిబ్బందికి సర్వే ప్రక్రియపై శిక్షణ అందిస్తున్న వైద్యాధికారులు

**ఉచితంగా టీకాలు..**

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా టీకాలు వేస్తారు. ప్రైవేటు ఆస్పత్రులలో కూడా ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయి. కానీ వాటికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటుగా ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఆమోదం పొంది లైసెన్స్ ఉన్న తయారీదారుల నుంచే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు టీకాలను కొనుగోలు చేస్తాయి. వ్యాక్సిన్లు అన్నింటికీ డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా లైసెన్స్ ఉంటుంది. గనుక ఇవి సురక్షితమైనవని, వీటి నాణ్యత గురించి ఏమాత్రం భయపడనవసరం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. వ్యాక్సిన్ల వల్ల పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరిగి ప్రమాదకరమైన జబ్బుల బారిన పడకుండా ఉంటారని అంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆస్పత్రులు**

| | |
|---|---|
| టీచింగ్ హాస్పిటళ్లు – | 2 |
| జిల్లా ఆస్పత్రి – | 1 |
| ఏరియా వైద్యశాల – | 7 |
| సీహెచ్‌సీలు – | 15 |
| పీహెచ్‌సీలు – | 106 |
| హెల్త్ క్లీనిక్‌లు – | 903 |
| ప్రై వేటు ఆస్పత్రులు – | సుమారు 3 వేలు |

**తప్పక టీకాలు వేయించుకోవాలి**



పిల్లలకు సమయానికి రోగ నిరోధక టీకాలు వేయించాలి. నిర్దిష్ట సమయంలో నిర్ణీత వ్యాక్సిన్ చేయించడంత ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు. ఈ టీకాల వేయించడం ద్వారా ప్రాణాంతకమైన పలు వ్యాధుల బారిన పడకుండా పిల్లలను కాపాడుకోవచ్చు. ప్రభుత్వ ఆమోదం పొంది లైసెన్స్ ఉన్న తయారీదారుల నుంచే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల యజమానులు టీకాలను తీసుకుంటారు. వాటిని ధైర్యంగా వేయించవచ్చు. ఇప్పటికే చిన్నారులు, గర్భిణుల నమోదు సర్వే వేగంగా జరుగుతోంది. సర్వే పకడ్బందీగా చేపట్టేలా తరచూ సర్వే ప్రక్రియను తనిఖీ చేసి వంద శాతం సర్వే పూర్తిచేయడం జరిగింది.

– డాక్టర్ రవిరాజు,
జిల్లా టీకాఅధికారి, చిత్తూరు జిల్లా.

# చంద్రబాబు టెర్రరిస్టులా వ్యవహరిస్తున్నాడు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- బాబు పాలనలో పేదలకు న్యాయం జరగదు
- అభివృద్ధి అంటే సీఎం జగనన్న, మంత్రి పెద్దిరెడ్డితోనే సాధ్యం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: శాంతిభద్రతల పరిరక్షణకు అనునిత్యం కృషి చేసే పోలీస్ వ్యవస్థపై బీరుబాటిళ్లు, రాళ్లు, కత్తులు, తుపాకులతో దాడులు చేయించిన చంద్రబాబు ఓ టెర్రరిస్టులా వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. ఆదివారం రాత్రి కార్వేటినగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం దాహంతో చంద్రబాబు టెర్రరిస్టులా మారి పోలీసులపై దాడులు చేయించి పైశాచిక ఆనందం పొందుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎప్పుడూ పేదలు అభివృద్ధి చెందితే ఓర్వడని ఆరోపించారు. అభివృద్ధిలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిట్టని, ఆలయాల నిర్మాణంలో ఆయనకు ఎవరూ సాటి రారని అన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు కక్ష కట్టి పోలీసులపై దాడులు చేయించడం అమానుషం అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కళ్లు తెరిస్తే రాజకీయంగా బూడిదైపోతావని, ఆయన ఓర్పు, సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. ఉన్నతస్థాయి పోలీస్ అధికారులను మీ అంతు చూస్తా అని అనడం బాబు నీచరాజకీయానికి దర్పణం పడుతోందన్నారు. పుంగనూరులో తన కార్యకర్తలను రెచ్చగొట్టిన చంద్రబాబుపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

**ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి**

శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులు బాగ జరుగుతున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలోని స్కంధపుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయ అభివృద్ధి పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయని అన్నారు. కార్వేటినగరం చారిత్రాత్మక కట్టడాలకు, ఆలయాలకు కూడా నిలయమన్నారు. తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు. నియోజకవర్గంలోని కనిగిరికొండ, వరద వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపానికి అదనపు గదులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు అన్నారు. అలాగే గోవర్ధనేశ్వర ఆలయం, అగస్తీశ్వరస్వామి ఆలయం, అరిమాని గంగమ్మ ఆలయాలను పునర్‌నిర్మిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గ్రామాల్లో కూడా 75 ఆలయాలను నిర్మాణం చేపట్టడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, డాక్టర్ దీపక్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవు, నాలుగు మండలాల మండల కన్వీనర్లు, ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్, పయణిరెడ్డి, దొరబాబు, వెంకటరత్నం, శివప్రకాష్ మొదలి, శోభన్‌బాబు, శ్రీనివాసులురెడ్డి పలువురు పాల్గొన్నారు.



సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని సందర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


### ఘనంగా స్నేహితుల దినోత్సవం



రాఖీ కడుతున్న స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులు

పుత్తూరు రూరల్: స్థానిక గేట్‌పుత్తూరులోని స్కౌట్ అండ్ గైడ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సభ్యులందరూ సమాజంలోని ప్రతి ఒక్కరినీ స్నేహితులుగా భావించాలని అప్పుడే అందరిలో సంతోషం వెల్లివిరుస్తుందన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో గేట్ పుత్తూరు జెడ్పీ హైస్కూల్ స్కౌట్స్ మాస్టర్ జయదేవ్, రేంజర్ లీడర్ భువనేశ్వరి, శైలజ, మల్లేశ్వరి, గైడ్ కెప్టెన్ రోజా, లీడర్ చారులత, గీతిక, విద్యార్థులు పాల్గొన్నారు.

### సుదర్శన హోమం ముగింపు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహా స్వామి ప్రధాన ఆలయంలో గత 49 రోజులుగా నిర్విరామంగా జరుగుతున్న సుదర్శన హోమం ఆదివారంతో వైభవంగా ముగిసింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆరాధన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ట్రస్టు శ్రీధర్ అడ్వొకేట్ వాసు ఆధ్వర్యంలో 49 రోజుల పాటు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, శేషాద్రి స్వామి వేద మంత్రాల నడుమ, మంగళవాయిద్యాల నడుమ సుదర్శన హోమం వంటి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదారులుగా గంగాధరనెల్లూరు చెందిన మధుసూదన్, శ్యామల దంపతులు, అలాగే వేపంజేరికి చెందిన హరి ప్రసాద్ వ్యవహరించారు.

# ఆకట్టుకున్న దుర్యోధన వధ





దుర్యోధనున్ని వధ ఘట్టంలో భీమసేనుడి పాత్రధారి, దుర్యోధన వధ ఘట్టాన్ని వీక్షిస్తున్న జనం

పాలసముద్రం : మండలంలోని తొట్టికండ్రిగ పంచాయతీ వేపకోన గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గదాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేంకటేశ్వర నాట్యబృదంలోని తారక్ భీమసేనుడిగా, దేవ దుర్యోధనుడి పాత్రలు వేసి కురుక్షేత్ర యుద్ధం ముగింపు సన్నివేశాన్ని రక్తి కట్టించారు. సర్వంకోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లగా, బయటకు రప్పించడానికి భీమసేనుడు రెచ్చగొట్టే సన్నివేశం ఆహుతులను అలరించింది. అనంతరం దుర్యోధనున్ని వధించే సన్నివేశాలను కళాకారులు రక్తికట్టించారు. ఈ సన్నివేశాలను తిలకించడానికి స్థానిక ప్రజలతో పాటు తమిళనాడు నుంచి వందలాదిమంది తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి స్వామివారి ఊరేగింపు, పచ్చిగెరిగ అగ్నిగుండ మహోత్సవం ఘనంగా జరిగాయి.

### లక్ష్మమ్మ కుటుంబానికి పరామర్శ



లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామానికి చెందిన తుడా అడ్వైజర్ శివాల దామోదర్‌రెడ్డి తల్లి ఎస్.లక్ష్మమ్మ(81) కొనాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతూ రెండురోజుల కిందట మృతి చెందారు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం ఆర్కేవీబీ పేట గ్రామానికి వెళ్లి దామోదర్‌రెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శించారు. ఆయన వెంట వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, దొరస్వామిరెడ్డి ఉన్నారు.

# వైభవంగా ద్రౌపదమ్మ తిరునాళ్ల





దుర్యోధన, దుశ్శాసన వేషధారులతో స్థానికులు, పూజలు చేస్తున్న భక్తులు

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో, మండలంలోని కృష్ణారామపురం గ్రామంలో ద్రౌపదమ్మ తిరునాళ్లు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటా పండగ వాతావరణం కనిపించింది. వీధులకు వేపాకు తోరణాలు కట్టారు. ద్రౌపదమ్మ ఆలయం వద్ద అమ్మవారి పాటలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భీమ, దుర్యోధన వేషధారణలో వచ్చిన వారు పోరాడే సన్నివేశం అందరినీ అలరించింది. ఆలయ ఆవరణలో దుర్యోధన వధ ఘట్టాన్ని కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుమారు 40 అడుగుల పొడవుతో తయారు చేసిన దుర్యోధన, దుశ్శాసన ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆ ప్రతిమల వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు ద్రౌపదీ, ధర్మరాజ దేవుళ్లను, అలుగును దర్శించుకున్నారు. నిర్వాహకులు నటరాజన్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చెన్నై నుంచి తెప్పించిన వివిధ రకాల భారీ రంగుల రాట్నాలు, పలు దుకాణాల వద్ద చిన్నారులు సందడి చేశారు. రాత్రి ఆలయ సమీపంలో నిర్వాహకులు అగ్నిగుండం ఏర్పాటు చేయగా కంకణాలు ధరించిన భక్తులు పసుపు దుస్తులు ధరించి మంగళస్నానాలు చేసి అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరనాళ్లకు వేలసంఖ్యలో జనం వచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు, పిక్ ప్యాకెటింగ్ జరగకుండా సీఐ శ్రీనివాసంతి భద్రతా చర్యలు చేపట్టారు.

# సీఐ చంద్రశేఖర్ సేవలు ఆదర్శనీయం



సీఐ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ రవికుమార్, సిబ్బంది

కార్వేటినగరం: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయమని నగరి డివిజన్ డీఎస్పీ రవికుమార్ అన్నారు. తిరుపతి విజిలెన్స్ బదిలీపై వెళ్లిన సీఐ చంద్రశేఖర్‌కు కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐ పోలీస్ సిబ్బంది ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు స్నేహభావంతో మెలిగి ఉత్తమసేవలు అందించినప్పుడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అలా అందరి అభిమానం చూరగొన్న వ్యక్తి చంద్రశేఖర్ అని కొనియాడారు. కేసులు ఛేదించడంలో, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచడంతో పాటు శాంతి భద్రతలను కాపాడడంలో ఆయనను మించిన వారు లేరని డీఎస్పీ గుర్తు చేశారు. ప్రతి పోలీస్ అధికారి సీఐ చంద్రశేఖర్‌ను విధి నిర్వహణలో ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐలు షెక్షావలి, దస్తగిరి మాట్లాడుతూ ఉన్నత భావాలు కలిగిన సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పని చేయడం తమ అదృష్టమన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, పాత్రికేయులు సీఐ చంద్రశేఖర్‌కు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ విశ్వనాథరెడ్డి, సురేష్‌కుమార్, నాగరాజారావు, రాజశేఖర్, ఎస్‌ఐ గోపి, ఏఎస్‌ఐ మునికృష్ణ, సర్పంచ్‌లు ధనుంజయ వర్మ, కుప్పయ్య, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రోసిరెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 250 మందికి దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సత్యఫౌండేషన్ నిర్వాహకులు

కార్వేటినగరం: బీసీకాలనీలోని బేతేల్‌షారోన్ చర్చిలో సత్య ఫౌండేషన్ డైరెక్టర్ మునికృష్ణయ్య ఆదివారం 250 మంది పేదలకు ఉచితంగా పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ మునికృష్ణయ్య మాట్లాడుతూ ఏటా తమ సంస్థ ద్వారా పేదలకు దుస్తులు, అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రభువు ఆశీస్సులతో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ పేదలకు సేవ చేసే భాగ్యాన్ని ప్రభువు తమకు కల్పించారని తెలిపారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సుమారు 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి సత్యవేణి, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పడవేటమ్మకు అంబలి



అమ్మవారి ఎదుట అంబలి పోస్తున్న భక్తులు

పాలసముద్రం : మండలకేంద్రం పాలసముద్రంలో వెలసిన పడవేటమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం అమ్మవారికి అంబలి పోయుట, పాలాభిషేకం చేపట్టారు. భక్తులు అంబలి, పూజాసామగ్రిని పంబవాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పాల బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని పాలతో అభిషేకించారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. కాపుకట్టిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నేడు అమ్మవారి ఎదుట అగ్గితొక్కుట, పుష్పపల్లకిపై అమ్మవారి ఊరేగింపు జరుగుతుంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయంలో కిటకిటలాడారు.



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

# నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



సభ నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన స్టేజీ

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేటలో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామితో పాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు ఆదిమూలం(సత్యవేడు), ఎంఎస్ బాబు(పూతలపట్టు), ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు ఆవిష్కరిస్తారని సర్పంచ్ చొక్కా గోవిందయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాజీ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నిర్వాహకులు, స్థానిక యువత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 60 ఏళ్లుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న స్థానికుల కల ఎట్టకేలకు నెరవేరుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రయత్నాలు చేసినా అప్పట్లో ఆటంకాలు సృష్టించారని దళిత నాయకులు తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో 10 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి సోమవారం ఉదయం 11.30 గంటలకు ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ఈమేరకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం దేవళంపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు 2 వేల మందికి భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.



ఆవిష్కరణకు సిద్ధంగా అంబేడ్కర్ విగ్రహం